

అనతి కాలంలోనే
ప్రజల మన్ననలు చూరగొన్న
వన్ నేషన్ దినపత్రికను
చదవండి... చదివించండి....



# వన్ నేషన్

RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

సంపుటి: 16 సంచిక: 292 ఎడిటర్: కె.యువరాజ్ ఆదివారం 2-8-2026 పేజీలు: 4 వెల: రూ.3/-



వన్ నేషన్
దినపత్రికను
ఆదరిస్తున్న పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
మా హార్థిక
శుభాకాంక్షలు





**హైదరాబాద్, ఆగస్టు 1 (వన్‌నేషన్):** తెలంగాణ ఆర్థికాభివృద్ధి కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, గతేడాదితో పోలిస్తే రూ.38,900 పెరిగిందని ఆయన వెల్లడించారు. ఒకే ఏడాదిలో 10.23 శాతం వృద్ధి నమోదు చేయడం తెలంగాణ ఆర్థిక వృద్ధికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తా కథనం సంబంధిత స్క్రీన్ షాట్‌ను ఎక్స్‌లో షేర్ చేశారాయన. దేశంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచిందని పేర్కొంటూ.. పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన, పరిశ్రమల అభివృద్ధి, ఆర్థిక వృద్ధి కారణంగానే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. విధానపరమైన పాలన, పారదర్శక నిర్ణయాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం వల్ల తెలంగాణ అభివృద్ధి వేగంగా సాగుతోందని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ అభివృద్ధి ఫలాలు ముఖ్యంగా మహిళలు, రైతులు, యువతకు చేరుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గత దశాబ్దంలో నెలకొన్న నిరాశను తొలగించి ప్రజల్లో కొత్త ఆశావాదాన్ని నింపామని, తెలంగాణను దేశంలో అభివృద్ధికి ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రానున్న సంవత్సరాల్లో మరిన్ని పెట్టుబడులు, ఉపాధి అవకాశాలతో తెలంగాణ మరింత పురోగతి సాధిస్తుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.



## సికింద్రాబాద్‌లో లష్కర్ బోనాల సందడి..

### తొలి బోనం సమర్పించిన మంత్రి పొన్నం

**హైదరాబాద్, ఆగస్టు 1 (వన్‌నేషన్):** నగరంలో లష్కర్ బోనాల సందడి నెలకొంది. సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. ప్రభుత్వం తరఫున అమ్మవారికి మంత్రి పొన్నం ప్రభాకర్ తొలి బోనం సమర్పించారు. సాధారణ భక్తుల కోసం 3 క్యూ లైన్లు, బోనాల సమర్పించేందుకు వచ్చిన భక్తుల కోసం రెండు క్యూ లైన్లు దేవస్థానం అధికారులు ఏర్పాటు చేశారు. బోనాలు సమర్పించేందుకు వచ్చిన భక్తులతో సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో సందడి నెలకొంది. సోమవారం అమ్మవారి భవిష్యవాణి

4లో

## 'భోగాపురం' గ్రాండ్ టేకాఫ్.. ఎటుచూసినా జనసంద్రమే



### - 'భోగాపురం' గ్రాండ్ టేకాఫ్ - ఎయిర్‌పోర్టుకు వెళ్లే దారులన్నీ కిటకిట - సభాప్రాంగణంలో రెండు లక్షల మంది - ఏర్పాట్లపై ప్రధాని, సీఎం సంతృప్తి

**భోగాపురం ఆగస్టు 1 (వన్‌నేషన్):** రాష్ట్రంలోనే అతి పెద్ద అంతర్జాతీయ విమానాశ్రయం ఆవిష్కృతమైన వేళ...ఉత్తరాంధ్రకు ఉత్సవ కళ వచ్చింది. నేల ఈనిందా... అన్నట్టు భోగాపురానికి జనం పోటెత్తారు. రూ.5,000 కోట్ల వ్యయం..అతి తక్కువ సమయంలో నిర్మాణం... ఆధునిక హంగులు, అందమైన సొబగులతో సిద్ధమైన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఘనంగా టేకాఫ్ తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా శనివారం ప్రారంభోత్సవం జరుపుకొంది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఒక ఉత్సవంలా నిర్వహించింది. ప్రారంభోత్సవం రోజే రన్‌వే...పలు ప్రైవేటు విమానాలు, హెలికాప్టర్లతో సందడిగా కనిపించింది. ఉత్తరాంధ్ర యువత భవిష్యత్తు ఎలా ఉండబోతుందో చూపించేందుకు అక్కడి ప్రజలను రెండు వేల బస్సుల్లో భోగాపురం తీసుకువచ్చారు.

## ఆవిష్కరణలు, సుస్థిరతతోనే కాగిత పరిశ్రమకు ప్రపంచ స్థాయి పోటీ సామర్థ్యం

### -పేపర్, ప్యాకేజింగ్ రంగాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుంది: నిఖిల్ చక్రవర్తి - పేపర్, పేపర్‌బోర్డ్ ప్యాకేజింగ్ ఉత్పత్తులపై జీఎస్‌టీనీ 5 శాతానికి తగ్గించాలి: టీపీఎంఏ - జాతీయ పేపర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో కాగితం పరిశ్రమ సదస్సు



**హైదరాబాద్, ఆగస్టు 1 (వన్‌నేషన్):** భారత తయారీ రంగంలో కాగిత పరిశ్రమ కీలకమైన స్థానాన్ని ఆక్రమిం చిందని, ప్రపంచ స్థాయిలో పోటీతత్వాన్ని కొనసాగించాలంటే పరిశ్రమ ఆవిష్కరణలు, సుస్థిరత, సాంకేతిక పురోగతిని స్వీకరించాలని తెలంగాణ పరిశ్రమల శాఖ డైరెక్టర్ శ్రీ నిఖిల్ చక్రవర్తి పిలుపునిచ్చారు. ఫెడరేషన్ ఆఫ్ పేపర్ ట్రేడర్స్ అసోసియేషన్ (ఎఫ్‌పీటీఏ), తెలంగాణ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ (టీపీఎంఏ) సంయుక్తంగా హైదరాబాద్‌లోని రెడ్ హిల్స్, ఎఫ్‌టీసీసీఐలో నిర్వహించిన జాతీయ కాగిత దినోత్సవ సెమినార్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో రూ.2,000 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు వచ్చిన హిందుస్థాన్ యూనిలీవర్ సంస్థ సైతం ఇక్కడి ప్యాకేజింగ్ సామర్థ్యాలపై ప్రత్యేకంగా ఆరా తీయడం ఈ రంగం ప్రాముఖ్యతను, భారీ పెట్టుబడులను ఆకర్షించే సత్తాను స్పష్టం చేస్తోందని ఆయన వివరించారు. సెమినార్‌లో ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు కె.కె. మహేశ్వరి, ప్రగతి ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ నరేంద్ర పరుచూరి, తెలంగాణ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ (టోపా) అధ్యక్షుడు రాధాకృష్ణ, అసోసియేషన్ ఆఫ్ కొరుగేటెడ్ కేస్ ఆఫ్ తెలంగాణ (ఏసీసీటీ) అధ్యక్షుడు ఆదిత్య శర్మ, తెలంగాణ సీఏఐటీ అధ్యక్షుడు విమల్ కుమార్ నహర్, పేపర్ డే వేడుకల కన్వీనర్లు శ్రీ దినేష్ రాఠీ




మరియు శ్రీ ఆనంద్ బజాజ్‌తో పాటు పేపర్, ప్రింటింగ్, ప్యాకేజింగ్ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, నిపుణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మరింత సమాచారానికి దయచేసి సంప్రదించండి : 9959154371 / 9963980259.

## జై శ్రీ లక్ష్మి నరసింహ స్వామి జువెల్లరీస్ లో అతివలకు నచ్చే ఆకర్షణీయమైన ఆభరణాలు లభ్యం



**వనస్థలిపురం/వన్ నేషన్ :** వనస్థలిపురం కాంప్లెక్స్ లో ఉన్న జై శ్రీ లక్ష్మి నరసింహ స్వామి జువెల్లరీస్ లో అతివలకు నచ్చే ఆకర్షణీయమైన ఆభరణాలు లభిస్తున్నాయి. నిర్వాహ కులు మాట్లాడుతూ మావద్ద వన్ గ్రామ్ గోల్డ్, పంచలోహం, పెరల్స్, రుబీస్, సిజెయిడ్, లక్కీ స్టోన్స్, సూరజ్ కి, వడ్డాణాలు, నక్లీసులు, గాజులు, ఉంగరాలు, కాంబో సెట్స్, మ్యారేజ్ స్టేట్స్,ఇంకా ఇతర ఇతర ఐటమ్స్ ఎంత క్వాలిటీతో రీజనబుల్ రేట్లలో లభిస్తున్నట్లు తెలిపారు. మీ సారికి తగ్గట్టుగా మేము నగలు అందిస్తామని అన్నారు. గత 30 సంవత్సరాల నుండి తాము ఈ రంగంలో ఉన్నామని మాపై విశేషా ప్రజాధరణ ఉంటుందని, ఇలాంటి కలెక్షన్స్ ఎక్కడ లేవని మా వద్ద ఉంటాయని పేర్కొన్నారు. అట్లాగే సోషల్ మీడియాలో తమ కలెక్షన్స్ అందుబాటులో ఉన్నాయని ఆన్లైన్లో బుక్ చేసుకుంటే హోమ్ డెలివరీ చేస్తామని అన్నారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోండని కోరారు. మరిన్ని వివరాల కొరకు 7382671200, 9000177853 నెంబర్లకు సంప్రదించగలరని సూచించారు.


వన్ నేషన్
RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని



అనుకుంటున్నారా?
బాధ్యతయుతమైన జర్నలిజంలో
రాణించాలనుకుంటున్నారా?
అయితే రండి...



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాలు, మండలాల వారీగా పనిచేసే విలేకరులు కావలెను.

9948222240

# రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని కలిసిన కార్మిక నాయకుడు కర్కనాగరాజు

**కూకట్‌పల్లి ప్రతినిధి, ఆగస్టు 1 (వన్‌నేషన్):** శనివారం మినిస్టర్ క్వార్టర్స్‌లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని కూకట్‌పల్లి నియోజకవర్గం ఐ.ఎన్.టి.యు.సి అధ్యక్షులు కర్కనాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్.యస్.యు.ఐ రాష్ట్ర అధ్యక్షుడిగా పొన్నం ప్రభాకర్ తో గతంలో విద్యార్థి నాయకుడిగా వారితో కలిసి పనిచేసిన రోజులను నెమరేసుకున్నారు. కార్మిక నాయకుడిగా కార్మికలకు మరింత సేవ చేయాలని దివంగత నేత పి.జే.ఆర్ గారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్ళాలని కర్కనాగరాజు కు సూచించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించటం లో కాంగ్రెస్ ప్రభుత్వం ముందువుంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ నాయకులు ఎర్ర కృష్ణ కుమార్, మొహ్సిన్ ఖురేషీ తదితరులు పాల్గొన్నారు.



# వృద్ధుల కోసం పార్కుల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి

## వడ్డేపల్లి రాజేశ్వరరావు

**కూకట్‌పల్లి ప్రతినిధి, ఆగస్టు 1 (వన్‌నేషన్):** మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ని కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ 6వ ఫేజ్‌లోని సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ ప్రతినిధులు రాష్ట్ర బిజెపి సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో కెపిహెచ్బి కంటెస్టెంట్ కార్పొరేటర్ ప్రీతం రెడ్డి, వసంత్ నగర్ బీజేపీ సీనియర్ నాయకులు గురు ప్రసాద్ తో కలిసి మర్యాదపూర్వకంగా కలిసి, సీనియర్ సిటిజన్స్ పార్క్ అభివృద్ధికి సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, వృద్ధులకు ప్రశాంతమైన వాతావరణంలో విహరించేలా పార్కులను అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేయడం అత్యంత అవసరమని అన్నారు. కేపీహెచ్‌బీ 6వ ఫేజ్ సీనియర్ సిటిజన్స్ పార్క్‌లో నెలకొన్న సమస్యలను పార్లమెంట్ సభ్యులు ఈటెల దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. వినతిపత్రంలో పార్కు గ్రౌండ్ ఎత్తు పెంపు, ప్రహరీ గోడ ఎత్తు పెంపు, నాణ్యమైన బెంచీల ఏర్పాటు, పూల మొక్కలు, నీడనిచ్చే చెట్ల పెంపకం, తగినన్నీ విద్యుత్ దీపాల ఏర్పాటు, పార్కు నిర్వహణను మెరుగుపరచడం వంటి అంశాలను ప్రస్తావించారు.ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో మాట్లాడి పార్కు అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎమ్.కోటేశ్వరరావు, సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు సుబ్బరాజు, శివశంకర్ రెడ్డి, ప్రొఫెసర్ అప్పారావు, రామకృష్ణ, భానుమతి, గాయత్రి,రమణారావు,జనార్ధన్, కొండ రెడ్డి స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఇంద్రపాలనగరంలో తల్లిపాల వారోత్సవాలు

**యాదాద్రి జిల్లా: రామన్నపేట ఆగస్టు 1, (వన్ నేషన్ ):** ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ఈ రోజు ఇంద్రపాలనగరం లో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ గర్దాస్ విక్రమ్, మాట్లాడుతూ గర్భిణీలు ప్రసవం అయిన అర్ధగంట లోపే,పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించడం ఎంతో శ్రేష్ఠమైనవి జీవితకాలం ఆరోగ్యవంతంగా,ఉండేందుకు దోహదపడతాయని గర్భిణీ లను ఉద్దేశిస్తూ చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమం లో సిపిడిఓ, వెంకటరమణ,పంచాయతీ కార్యదర్శి నరేందర్,సూపర్ వైజర్, సుజాత,పోషణ అభియాన్ అశోక్, అంగన్వాడి టీచర్లు,ఆశాలు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.




# బస్సు ఎక్కుతున్న వారినే టార్గెట్... ముగ్గురు జేబుదొంగలు అరెస్ట్

**ఎల్బినగర్ ప్రతినిధి,వన్ నేషన్, ఆగస్టు 01:** బస్సు ఎక్కే ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని సెల్‌ఫోన్లు అపహరిస్తున్న ముగ్గురు అలవాటు నేరస్తులను నాగోల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఒక ఐఫోన్, ఒక మోటరోలా సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని న్యాయస్థానంలో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. జూలై 31న నాగోల్ చౌరస్తాలోని బస్‌స్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్న నారాయణ రాజ్‌కుమార్, వెంకటాచారి బస్సు ఎక్కుతున్న సమయంలో కావడి శివ (22) వారిని మాటల్లో పెట్టి దృష్టి మరల్చగా, అతనితో పాటు ఉన్న మేకల జగపతి బాబు అలియాస్ జగపతి, బోయ అలియాస్ గారడీ మంజునాథ్ అలియాస్ మంజు వారి జేబుల్లోని రెండు సెల్‌ఫోన్లను అపహరించి పరారయ్యారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన నాగోల్ పోలీసులు ఆగస్టు 1న నాగోల్ చౌరస్తా వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి దొంగిలించిన రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ప్రధాన నిందితుడు మేకల జగపతి బాబుపై వివిధ పోలీస్‌స్టేషన్లలో 7 సెల్‌ఫోన్ చోరీ కేసులు, బోయ అలియాస్ గారడీ మంజునాథ్‌పై 4 చోరీ కేసులు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు నాగోల్ పోలీసులు తెలిపారు.



# కూకట్‌పల్లిలో 138 ఆలయాలకు బోనాల నిధుల చెక్కులు పంపిణీ

**కూకట్‌పల్లి ప్రతినిధి, ఆగస్టు 1 (వన్‌నేషన్):** తెలంగాణ రాష్ట్ర ఆషాఢ మాస బోనాల పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ శాఖ ఆధ్వర్యం లో అందజేస్తున్న ఆర్థిక సహాయ నిధుల చెక్కుల పంపిణీ కార్యక్రమం శనివారం కూకట్పల్లి నియోజకవర్గంలోని భరత్ నగర్ శ్రీ హరిహర క్షేత్రం ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ బండి రమేష్, కూకట్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుష్పా రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై, కూకట్పల్లి నియోజకవర్గ పరిధిలోని 138 ఆలయ కమిటీల అధ్యక్షులకు ప్రభుత్వ ఆర్థిక సహాయ నిధుల చెక్కులను అందజేశారు.

ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. జగజ్జనని అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతూ దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా ముందుకు సాగుతోందని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి ఫలాలు గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రతి ఒక్కరికీ చేరేలా నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఆలయాల అభివృద్ధికి, ఆధ్యాత్మిక సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కూకట్పల్లి నియోజకవర్గంలోని ఆలయ కమిటీల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ గడువు పెంపు..

# ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలి

## మందలపు సాయిబాబా చౌదరి



**కూకట్‌పల్లి ప్రతినిధి, ఆగస్టు 1 (వన్‌నేషన్):** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను ఈ నెల 10వ తేదీ వరకు పొడిగించడం జరిగింది.

ఇంకా ఎస్ఐఆర్ దరఖాస్తులు పూర్తి చేయని వారు, ఫారాలు సమర్పించని వారు ఈ అవకాశాన్ని తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని మనవి. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరునికి అత్యంత విలువైన హక్కు. మనకు నచ్చిన ప్రజాప్రతినిధిని ఎన్నుకోవాలన్నా, ప్రభుత్వాన్ని మౌలిక సదుపాయాలపై ప్రశ్నించాలన్నా ఓటు హక్కు తప్పనిసరి.

ముఖ్యంగా హైదరాబాద్‌లో ఉద్యోగం, వ్యాపారం లేదా ఇతర ఉపాధి అవకాశాల కోసం వచ్చి ప్రస్తుతం ఇక్కడే స్థిరంగా నివసిస్తున్న వారు, మీరు నివసిస్తున్న ప్రాంతంలోనే మీ ఓటును నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాము. మీరు నివసిస్తున్న ప్రాంతంలో ఓటు ఉంటే, ఆ ప్రాంత అభివృద్ధికి సంబంధించిన సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు మీకు ఉంటుంది. భారత ప్రభుత్వం "ఒక వ్యక్తికి ఒకే ఓటు" అనే విధానానికి అనుగుణంగా ఈ ప్రక్రియను నిర్వహిస్తోంది. భవిష్యత్తులో మీరు వేరే ప్రాంతానికి మారినట్లయితే, నిబంధనల ప్రకారం మీ ఓటును కొత్త ప్రాంతానికి బదిలీ చేసుకునే అవకాశం ఉంటుంది. కాబట్టి ప్రతి ఒక్కరూ బాధ్యతగా మీ ఓటు హక్కును కాపాడుకోండి. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఈ నెల 10వ తేదీలోపు ఎస్ఐఆర్ దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయండి. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం... మన ఓటు హక్కును కాపాడుకుందాం.

## బాధితులకు న్యాయం చేయాలని ఎంపీ ఈటల రాజేందర్‌ని కలిసిన

# మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

**ఎల్బీనగర్ ప్రతినిధి, ఆగస్టు 01 (వన్ నేషన్) :** హయత్‌నగర్ మండలం శుభోదయ కాలనీలో హయత్‌నగర్--తారమతిపేట్ 100 అడుగుల రోడ్డు విస్తరణ నేపథ్యంలో ఇళ్లు కోల్పోయే ప్రమాదంలో ఉన్న బాధిత కుటుంబాలతో కలిసి మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ని వారి నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ, మదర్ డెయిరీ సమీపంలో ప్రభుత్వం గతంలో కేటాయించిన 60 గజాల స్థలాల్లో ఇళ్లను నిర్మించుకుని ఎన్నో సంవత్సరాలుగా నివాసం ఉంటున్నామని తెలిపారు. ప్రస్తుతం ప్రతిపాదిత 100 అడుగుల రోడ్డు విస్తరణలో తమ ఇళ్లు పూర్తిగా ప్రభావితమవుతున్నాయని, దీంతో వందకు పైగా కుటుంబాలు నిరాశ్రయులయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిని స్వీకరించిన ఎంపీ ఈటల రాజేందర్ వెంటనే బాధితులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ, అభివృద్ధి పేరుతో పేద ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా, వారి ఇళ్లు, జీవనాధారం మరియు భవిష్యత్తును కాపాడే విధంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. శుభోదయ కాలనీ వాసులకు న్యాయం జరిగే వరకు తమ వంతు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు బాధ్యత కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది.





# బోనాలు.. తెలంగాణ జీవనస్రవంతికి సాంస్కృతిక సాక్ష్యం



హైదరాబాద్, ఆగస్టు 1 (వన్‌నేషన్): తెలంగాణలో ఆషాఢ మాసంలో మహాకాళి, పోచమ్మ, ఎల్లమ్మ వంటి గ్రామదేవతలకు అత్యంత వైభవంగా నిర్వహించే రాష్ట్ర పండుగ బోనాలు. మహిళలు కొత్త కుండల్లో వండిన అన్నం, పాలు, బెల్లంతో నైవేద్యం సమర్పిస్తారు. తెలంగాణ సాంస్కృతిక ఆచారానికి ప్రతీకగా నిలిచిన ఈ పండుగ భక్తి, విశ్వాసం, సంప్రదాయాల సమ్మేళనంగా తరతరాలుగా కొనసాగుతోంది.

ఒక నగరం ఎంత ఆధునికంగా ఎదిగినా... తన మూలాలను మరచిపోకపోతేనే అది నాగరికతకు నిజమైన చిరునామా అవుతుంది. హైదరాబాద్ ఆ విషయాన్ని ప్రతి ఆషాఢ మాసంలో ప్రపంచానికి మరోసారి గుర్తుచేస్తుంది. మెట్రో రైళ్లు పరుగులు తీసే వీధుల్లో, అంతర్జాతీయ కంపెనీలతో కళకళలాడే సైబరాబాద్ మధ్యలో డప్పుల మోత వినిపిస్తుంది. తలపై బోనం మోసిన మహిళల అడుగులు కనిపిస్తాయి. పోతురాజు వీరనృత్యం ఉత్సాహాన్ని నింపుతుంది. ఆ క్షణంలో హైదరాబాద్ కేవలం ఒక మహానగరం కాదు. తన చరిత్రను, సంస్కృతిని, విశ్వాసాన్ని గుండెల్లో దాచుకున్న తెలంగాణ స్ఫూర్తి దర్శనమిస్తుంది.

పండుగలు కేవలం సెలవు రోజులు కావు. అవి ఒక జాతి జ్ఞాపకాలు. ఒక సమాజం జీవన విధానం. ఒక తరం నుంచి మరో తరానికి చేరే సంస్కృతి వారసత్వం. తెలంగాణకు అలాంటి జీవంతమైన వారసత్వమే బోనాల పండుగ. ఇది కేవలం మతపరమైన వేడుక కాదు. భక్తి, కుటుంబ బంధం, స్త్రీశక్తి, జానపద కళలు, సామాజిక ఐక్యత, స్థానిక సంస్కృతి కలిసిన మహోత్సవం. అందుకే బోనాల ఘడియ రాగానే తెలంగాణ సంస్కృతి తన సంపూర్ణ వైభవాన్ని ఆవిష్కరిస్తుంది. వీధులు పండుగ వాతావరణంతో నిండిపోతాయి. ప్రతి ఇంటిలో అమ్మవారి పేరు వినిపిస్తుంది.

బోనాల చరిత్రను పరిశీలిస్తే, ప్రజల విశ్వాసం ఎంత గొప్పదో అర్థమవుతుంది. 1813 ప్రాంతంలో హైదరాబాద్‌లో ప్లేగు వ్యాధి విజృంభించిన వేళ ప్రజలు అమ్మవారిని ప్రార్థించి, వ్యాధి నివారణ అనంతరం కృతజ్ఞతగా బోనం సమర్పించారనే చారిత్రక కథనం ప్రచారంలో ఉంది. కాలక్రమేణా ఆ ఆచారం కుటుంబం నుంచి గ్రామానికి, గ్రామం నుంచి నగరానికి, అక్కడి నుంచి తెలంగాణ సాంస్కృతిక గుర్తింపుగా విస్తరించింది. 'బోనం' అంటే భోజనం. కానీ దాని వెనుక ఉన్న భావం కృతజ్ఞత. తల్లి తన బిడ్డకు ప్రేమగా అన్నం పెట్టినట్లే, భక్తుడు అమ్మవారికి ప్రేమతో నైవేద్యం సమర్పించడం.

బోనాల ప్రత్యేకత మహిళల భాగస్వామ్యంలో కనిపిస్తుంది. పసుపు, కుంకుమలతో అలంకరించిన బోనాన్ని తలపై మోసుకుంటూ అమ్మవారి ఆలయానికి వెళ్లే ప్రతి మహిళ భక్తికి ప్రతిరూపం. అది కేవలం ఒక ఆచారం కాదు. కుటుంబ శ్రేయస్సు కోసం, పిల్లల ఆరోగ్యం కోసం, సమాజ సంక్షేమం కోసం చేసే ప్రార్థన. తెలంగాణ సంస్కృతిలో స్త్రీకి ఉన్న గౌరవాన్ని బోనాలు ఎంతో అందంగా ప్రతిబింబిస్తాయి.

భక్తి ఉన్న చోటే విశ్వాసం బలపడుతుంది. తల్లి ఉన్న చోటే ఆశ ఉంటుంది. ఆ ఆశకు, ఆ విశ్వాసానికే బోనాలు ప్రతీక. బోనాలు అంటే కేవలం బోనం సమర్పించడం మాత్రమే కాదు. పోతురాజు వీరనృత్యం ధైర్యానికి సంకేతం. రంగం ప్రజల విశ్వాసానికి ప్రతిబింబం. ఘటాల ఊరేగింపులు సామూహిక భక్తికి నిదర్శనం. డప్పుల మోత తెలంగాణ జానపద సంస్కృతికి ప్రాణం. ఒక్కో సంప్రదాయం వెనుక ఒక చరిత్ర ఉంది. ఒక్కో ఆచారం వెనుక ఒక సామాజిక సందేశం ఉంది. చెట్టు వేర్లు బలంగా ఉంటేనే కొమ్మలు విస్తరిస్తాయి. అలాగే సంస్కృతి బలంగా ఉంటేనే సమాజం నిలబడుతుంది.

హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరంగా ఎదిగింది. అనేక దేశాల ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారు. అత్యాధునిక సాంకేతికత, అంతర్జాతీయ పెట్టుబడులు, భారీ నిర్మాణాలు నగర రూపాన్ని మార్చాయి. కానీ బోనాల పండుగ వచ్చినప్పుడు చార్మినార్ నుంచి సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయం వరకు, లాల్ దర్వాజ నుంచి గోల్కొండ ఎల్లమ్మ వరకు, బల్కంపేట ఎల్లమ్మ నుంచి పెద్దమ్మ ఆలయం వరకు కనిపించేది ఒక్కటే--- తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే భక్తి ప్రవాహం.

ఆధునికతను ఆలింగనం చేసుకున్న నగరం, సంప్రదాయాన్ని గుండెల్లో పెట్టుకుని ఎలా జీవించాలో హైదరాబాద్ ప్రపంచానికి నేర్పుతోంది.

బోనాల మహోత్సవం సామాజిక ఐక్యతకు కూడా గొప్ప నిదర్శనం. కులం, మతం, భాష, ప్రాంతం అనే భేదాలు అక్కడ కనిపించవు. అమ్మవారి ముందు అందరూ ఒక్కటే. ఇదే హైదరాబాద్ గంగా-జమున తహజీబ్. భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ బలం అయితే, బోనాలు దానికి సజీవ రూపం. "కలిసుంటే కలదు సుఖం" అనే సామెతను ఈ పండుగ ప్రతి సంవత్సరం ఆచరణలో చూపిస్తుంది. సమాజాన్ని విభజించే గోడల కంటే, కలిపే విలువలే శాశ్వతమని గుర్తు చేస్తుంది.

ఈ పండుగ ఆధ్యాత్మికతతో పాటు ఆర్థిక వ్యవస్థకూ ఊతమిస్తుంది. పూల వ్యాపారులు, కుమ్మరులు, చేతివృత్తి కళాకారులు, డప్పు కళాకారులు, చిన్న వ్యాపారులు, హస్తకళల విక్రేతలు---వేలాది కుటుంబాలకు బోనాలు ఉపాధిని అందిస్తాయి. విదేశాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే సందర్శకులు తెలంగాణ జానపద కళలను, స్థానిక ఆహార సంస్కృతిని, ఆలయ సంప్రదాయాలను ఆస్వాదిస్తారు. ఒక పండుగ ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థను ఎలా బలోపేతం చేయగలదో బోనాలు స్పష్టంగా చూపిస్తున్నాయి.

అభివృద్ధి అంటే కేవలం ఫ్లైఓవర్లు, ఐటీ టవర్లు, విశాల రహదారులు మాత్రమే కాదు. సంస్కృతిని కాపాడుకోవడం కూడా అభివృద్ధిలో భాగమే. మూలాలను మరచిపోయిన సమాజం భవిష్యత్తును నిర్మించుకోలేదు. సంస్కృతిని గౌరవించే సమాజమే శాశ్వతంగా నిలుస్తుంది. కొత్త తరానికి బోనాలు ఒక పండుగ మాత్రమే కాదు; తమ చరిత్రను తెలుసుకునే పాఠశాల. తమ నేలను, తమ భాషను, తమ సంప్రదాయాలను ప్రేమించడం నేర్పే జీవన పాఠం.

అందుకే బోనాలు తెలంగాణకు ఒక ఉత్సవం మాత్రమే కాదు... ఒక గుర్తింపు. ఒక భావోద్వేగం. ఒక ఆత్మగౌరవం. హైదరాబాద్ ఎంత ఎత్తుకు ఎదిగినా, దాని హృదయం మాత్రం అమ్మవారి ఆశీస్సులతోనే కొట్టుకుంటుంది. డప్పుల మోత వినిపించినంత కాలం, బోనం మోసే చేతులు ముందుకు సాగినంత కాలం, తెలంగాణ సంస్కృతి చిరస్థాయిగా నిలుస్తుంది. బోనాలను కాపాడుకోవడం అంటే ఒక పండుగను కాపాడుకోవడం కాదు; తెలంగాణ సంస్కృతిని, మన మూలాలను, భావితరాలకు అందించాల్సిన అమూల్య వారసత్వాన్ని పరిరక్షించడం. బోనాలు నిలిస్తే తెలంగాణ సంస్కృతి నిలుస్తుంది. తెలంగాణ సంస్కృతి నిలిస్తే మన అస్తిత్వం నిలుస్తుంది. అదే మన బాధ్యత. అదే మన గర్వకారణం.

**Dundra Kumaraswamy**
**B-pharm,MS,LLB**
**National president BC Dal**
**జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు**
**ChairmanÑ BC Reservation Co ordinationJAC**
**High court Advocate**
**9959912341**

# ఎల్బీనగర్ జీసస్ గ్రేస్ చర్చ్ మినిస్ట్రీస్ లో ఘనంగా ఉజ్జీవ ప్రార్ధనలు



ఎల్బీనగర్/వన్ నేషన్ : ఎల్బీనగర్ లోని జీసస్ గ్రేస్ చర్చ్ మినిస్ట్రీస్ లో వ్యవస్థాపకులు ఎల్బీనగర్ పాస్టర్స్ ప్రేయర్ ఫెల్లో షిప్ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ ఆర్చ్ బిషప్ డాక్టర్ ఎమ్.ఎస్ దయానంద్ అండ్ సంఘ సభ్యుల సహకారంతో శుక్రవారం నాడు ఉజ్జీవ ప్రార్ధనలు ఎంతో ఘనంగా జరిగాయి. ఈ ప్రార్ధనలకు ముఖ్య అతిధులగా అంతర్జాతీయ ప్రసంగికులు, నేషనల్ ప్రేయర్ మూవ్మెంట్ డాక్టర్ కే.వి పాల్ పాల్గొని చక్కని ఉపమానలతో సువార్తను అందించి ఆ ఏసు ఆశీస్సులు అందరిపై ఉండాలని ప్రేయర్ చేశారు. ఈ సందర్బంగా మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు ఎల్బీనగర్ పాస్టర్స్ ప్రేయర్ ఫెల్లోషిప్ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ ఆర్చ్ బిషప్ డాక్టర్ ఎమ్.ఎస్ దయానంద్ మాట్లాడుతూ ఈ ఉజ్జీవ ప్రార్ధనలకు విచ్చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దేవుని పట్ల సేవకులు, విశ్వాసకులు ఐక్యమత్యంగా ఉండే విధంగా ఈ ఉజ్జీవ ప్రార్ధనలు ఇక్కడ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ ప్రభు ఆశీర్వాదాలు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు నాయకులు ప్రజా ప్రతినిధులు, సకాలంలో వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని ఈ ఉజ్జీవ ప్రార్ధనలు చేశారు. ఈ కార్యక్రమంలో దైవ సేవకులు, దైవ జనులు, విశ్వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# లక్ష్మీ నరసింహ ఆలయానికి రూ 2లక్షల 50 వేలు విరాళం



నాంపల్లి, (వన్ నేషన్) : కోఠీలోని ఇసామియా బజార్ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి మురికి చంద్రమౌళి అనే భక్తుడు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ పూజారికి రూ 2 లక్షల 50 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి వారి వసతి గృహం కోసం 100 గజాల స్థలం కావాలంటూ గతంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రకటించడంతో ఈ మేరకు తాను సహాయం చేశానని పేర్కొన్నారు. ఆలయ పూజారి వారి కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులు మురికి చంద్రమౌళి వారి సతీమణి బాలలక్ష్మీ, కుమారులు సంతోష్ కుమార్-ప్రతిభ, సంపత్ కుమార్-పల్లవి, సతీష్ కుమార్-శ్వేత తదితరులు పాల్గొన్నారు.

# బోనాల సందర్భంగా ఆలయాల అభివృద్ధి కోసం 43 చెక్కుల పంపిణీ



బాలాపూర్ (వన్ నేషన్): మహేశ్వరం నియోజకవర్గంలోని మత్స్య వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయాల అభివృద్ధి కొరకు చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ చెన్నారెడ్డి, టియుఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నరసింహారెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నరసింహారెడ్డి పాల్గొని ఆలయాల అభివృద్ధి కోసం 17.63 లక్షల రూపాయలకు సంబంధించి 43 చెక్కులను అర్చకులు, ఆలయ కమిటీల ప్రతినిధులకు అందజేశారు.


# తెలంగాణ గవర్నర్ చేతుల మీదుగా డా. చిక్కాల వేణుగోపాల్ రావుకు "బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు" ప్రదానం




హైదరాబాద్, ఆగస్టు 1 (వన్‌నేషన్): వెర్చ్ కన్సల్టింగ్ ఎల్ఎల్‌పీ వ్యవస్థాపకులు మరియు సీఈఓ డా. చిక్కాల వేణుగోపాల్ రావు గారికి ప్రతిష్ఠాత్మక "బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు" ప్రదానం చేయబడింది. ఈ అవార్డును తెలంగాణ రాష్ట్ర గౌరవ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా 2026 హైదరాబాద్‌లోని హైటెక్స్ ప్రాంగణంలో జరిగిన ఇండియా & ఆసియా బిజినెస్ కాన్క్లేవ్ -- 2026 కార్యక్రమంలో అందజేశారు.

మానవ వనరుల నిర్వహణ (హ్యూమన్ రిసోర్సెస్), ఎగ్జిక్యూటివ్ సెర్చ్, లీడర్‌షిప్ కన్సల్టింగ్, ప్రతిభా అభివృద్ధి (టాలెంట్ మేనేజ్‌మెంట్) రంగాల్లో డా. వేణుగోపాల్ రావు గారు అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డా. వేణుగోపాల్ రావు మాట్లాడుతూ, ఈ గౌరవాన్ని తనకు అందించిన తెలంగాణ గవర్నర్ గారికి, కార్యక్రమ నిర్వాహకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "ఈ అవార్డు మా బాధ్యతను మరింత పెంచింది. సంస్థలకు ఉత్తమ నాయకత్వాన్ని అందించడం, మానవ వనరుల రంగంలో నాణ్యమైన సేవలు అందించడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం మా లక్ష్యం. ఈ గుర్తింపు మాకు మరింత ఉత్సాహాన్ని, స్ఫూర్తిని అందించింది" అని ఆయన తెలిపారు. వెర్చ్ కన్సల్టింగ్ ఎల్ఎల్‌పీ దేశంలోని ప్రముఖ హెచ్ఆర్ కన్సల్టింగ్ మరియు ఎగ్జిక్యూటివ్ సెర్చ్ సంస్థలలో ఒకటిగా గుర్తింపు పొందింది. వివిధ రంగాలకు చెందిన సంస్థలకు నాయకత్వ నియామకాలు, హెచ్ఆర్ కన్సల్టింగ్, సంస్థాగత అభివృద్ధి సేవలను అందిస్తూ విశేష కీర్తిని సంపాదించింది. డా. చిక్కాల వేణుగోపాల్ రావు ప్రముఖ హెచ్ఆర్ నిపుణుడు, రచయిత, నాయకత్వ మార్గదర్శి మరియు ప్రేరణాత్మక వక్తగా కూడా విశేష గుర్తింపు పొందారు. ఆయనకు లభించిన ఈ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు ఆయన వృత్తి జీవితంలో మరో విశిష్ట మైలురాయిగా నిలిచింది. మరింత సమాచారానికి దయచేసి సంప్రదించండి : 9959154371 / 9963980259.









## హైదరాబాద్, నేడు సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి జాతర

సికింద్రాబాద్ ఆగస్టు 1 (వన్‌నేషన్): నేడు జరిగే సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి జాతరకు సర్వం సిద్ధమైంది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని బోనాలు సమర్పించాలని అమ్మవారి కృపకు పాత్రలు కావాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

- ఫోటోగ్రాఫర్ శ్రీధర్..

# ప్రతి ఆటో ఒక సందేశం...

### హిందూత్వ చైతన్యమే లక్ష్యం - శ్రీరాములు అందెల




**బాలాపూర్ ఆగస్టు 1 (వన్ నేషన్):** మహేశ్వరం నియోజక వర్గం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బడంగ్ పేట్ సర్కిల్ లో గల మీర్ పేట్ డివిజన్ బిజెపి క్వార్టర్స్ లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శ్రీ ఆంజనేయ స్వామి వారికి రంగారెడ్డి జిల్లా బిజెపి సీనియర్ నాయకులు గాజుల మధు, యువజన నాయకులు రాఘవేందర్ గౌడ్, మన్యం రవీందర్ రెడ్డి మరియు క్లస్టర్ వన్ అధ్యక్షులు పసునూరి బిక్షపతి చారిఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ మరియు తెలంగాణ రాష్ట్ర కో–ఆపరేటివ్ సెల్ కన్వీనర్ కోలన్ శంకర్ రెడ్డి మరియు రంగారెడ్డి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గాజుల మధు రూపొందించిన ఈ భూమిపై పుట్టిన ప్రతి ఒక్కరు హిందువులే...మతం మారడం అనేది తండ్రిని మార్చుకోవడంతో సమానం అనే వ్యాఖ్యలతో కూడిన పోస్టర్లను శ్రీరాములు ఆవిష్కరించారు. అనంతరం ఆటో యూనియన్ అధ్యక్షులు శ్రీకాంత్ నేతృత్వంలో సుమారు



100కు పైగా ఆటోలకు పోస్టర్లను అతికించారు. ఈ సందర్భంగా అందెల శ్రీరాములు మాట్లాడుతూ, భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు, సనాతన ధర్మం పట్ల ప్రజల్లో చైతన్యం పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. సమాజంలో జాతీయ భావన, సాంస్కృతిక విలువలు, హిందూత్వ చైతన్యం మరింత విస్తరించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ప్రతి ఆటో ఒక సందేశం... హిందూత్వ చైతన్యమే లక్ష్యం అనే సందేశాన్ని ప్రతి వీధికి తీసుకెళ్లే లక్ష్యంతో ఆటోలకు ఈ పోస్టర్లను అతికిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు ధ్యాసనీ తిరుపతిరెడ్డి ఇందిరావత్ రవి నాయక్ సిద్దాల శ్రీనివాస్ వెంకటేశ్వర్ రెడ్డి బిజెపి మాజీ ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్ రెడ్డి, మాజీ అధ్యక్షులు పెంద్యాల నరసింహ, బీజేవైఎం రాష్ట్ర నాయకులు రాఘవేందర్ ముదిరాజ్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి ముదిరాజ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ముత్తంగి కరుణానిధి, బిజెపి రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, డివిజన్, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ పదాధికారులు బీజేవైఎం నాయకులు, ఆటో యూనియన్ నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విడదీయరాని స్నేహబంధం

### -మా నిజాయితే నిజమైన స్నేహం



**కన్నాయిగూడెం, ఆగస్టు 1 (వన్ నేషన్):** నిజమైన స్నేహితులు అంటే మన కష్టసుఖాలలో తోడుగా ఉంటారు అదే రీతిలో బుట్టాయిగూడెం మరియు చింతగూడెం గ్రామంలో ఏర్పడింది రెండు గ్రామాల్లో నుంచి ముగ్గురు వ్యక్తులు గత 31సం,రాల నుంచి వాల్ల స్నేహం కొనసాగుతోంది వీరి స్నేహంలో నమ్మకాన్ని నిలబెట్టే వెలకట్టలేని బంధాన్ని పంచి కష్టకాలంలో తోడు ఆపదలో లేదా బాధలో ఉన్నప్పుడు ఎప్పుడూ వెన్నుదన్నుగా ఒకరికి ఒకరు నిలుస్తూ వారి నిజాయితీని చాటుకున్నారు నిస్వార్థ ప్రేమతో ఎలాంటి ఆశలు లేదా ఆంక్షలు లేకుండా స్వచ్ఛమైన ప్రేమను పంచుతూ వారి గొప్ప స్నేహానికి 31సంవత్సరం గడిచింది స్నేహానికి వయసుతో సంబంధం లేదని నిజమైన స్నేహం కాలం గడిచే కొద్దీ మరింత బలపడుతుందని నిరూపిస్తున్నారు ఈ ముగ్గురి స్నేహితుల పేర్లు సునార్కని నర్సింహారావు,గాంధేర్ల సమ్మయ్య,దుర్గం రాజు 1995 నుంచి ఇప్పటివరకు ఎలాంటి మనస్పర్థలు లేకుండా తమ స్నేహాన్ని కొనసాగిస్తున్నారు.ముగ్గురిలో ఎవరికైనా ఆపద వచ్చినప్పుడు మిగతా ఇద్దరూ ఆపన్నహస్తం అందిస్తూ అండగా నిలుస్తున్నారు. నర్సింహారావు ఖమ్మంలో మెడికల్ రంగంలో స్థిరపడగా, సమ్మయ్య ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. దుర్గం రాజు వ్యవసాయంతో పాటు జర్నలిస్ట్‌గా కొనసాగుతున్నారు.

ఇటీవల రాష్ట్ర మంత్రి సీతక్కను ముగ్గురు స్నేహితులు కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. మూడు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న తమ స్నేహబంధాన్ని చూసి గ్రామస్థులు అభినందిస్తున్నారు. నేటి తరానికి వీరి స్నేహం ఆదర్శంగా నిలుస్తోందని పలువురు పేర్కొన్నారు.

# సికింద్రాబాద్‌లో లష్కర్ బోనాల సందడి..

(1వ పేజీ తరువాయి)

'రంగం' కార్యక్రమం ఉంటుంది. లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీస్ బందోబస్తుతోపాటు ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేకంగా వాటర్ క్యాంప్స్ ఏర్పాటు చేశారు. అలాగే వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్స్, అంబులెన్స్‌లు ఏర్పాటు చేశారు. దేవాలయంలో అమ్మవారి దర్శనానికి శివ శక్తులకు మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు సమయం కేటాయించారు. ఆదివారం రాత్రి, సోమవారం రాత్రి అమ్మవారి ఫలహర బండ్ల ఊరేగింపు ఉంటుంది.

మరోవైపు ఉజ్జయిని మహంకాళి బోనాల జాతరకు సికింద్రాబాద్‌లో ట్రాఫిక్ పోలీసులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆగస్టు 2 నుంచి 4 వరకు జరిగే ఈ జాతరకు పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ డైవర్షన్లు పకడ్బందీగా అమలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. పార్కింగ్ ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ, వాహనాల క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి సారించారు. జాతర వేళ ట్రాఫిక్ సూచనలు తప్పనిసరిగా పాటించాలని భక్తులకు పోలీసులు సూచించారు.

Printed, Published and Owned by **K.YOUVARAJ** Published at H.No.16-1-427/1, MARUTHI NILAYAM, SAIDABAD, HYDERABAD-59. Printed at ALLAZ PRINTING PRESS H.No. 22-8-147, CHATTA BAZAR, HYDERABAD- 500002, Editor: **K.YOUVARAJ**, RNI No. APTEL/2010/33523, **E-mail: onenation014@gmail.com.**